వైఎస్సార్‌సీపీలో కొత్త జోష్

- సీఎం జగన్ హామీలతో నాయకులు, కార్యకర్తల్లో మరింత ఉత్సాహం
- సభ భారీ సక్సెస్‌తో ప్రతిపక్షాల్లో గుబులు

కళ్యాణదుర్గం: సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గం పర్యటన విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీలో కొత్త జోష్ వచ్చింది. ఎన్నికలు ఏ సమయంలో వచ్చినా ఈ సారి కూడా కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందనే రెట్టింపు ఉత్సాహంతో పార్టీ శ్రేణులు ఉరకలేస్తున్నాయి. దీంతో ఈ సారి ప్రతిపక్షాలకు ఇక్కడ చాన్స్ లేదంటూ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి. కళ్యాణదుర్గంలో ఈ నెల 8న రైతులకు వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం విడుదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకావడం, సభ భారీ సక్సెస్ కావడంతో ప్రతిపక్షాలకు వణుకు మొదలైంది.

ప్రతిపక్షాలకు గుబులు..

అసలే కళ్యాణదుర్గంలో టీడీపీ రెండు వర్గాలుగా చీలిపోయి వర్గపోరుతో కొట్టుమిట్టాడుతుంది. టికెట్ తమకంటే తమకంటూ ఓ వైపు మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి, మరోవైపు టీడీపీ ఇన్‌చార్జ్ ఉమా మహేశ్వర నాయుడులు వర్గపోరుతో కార్యక్రమాలు చేస్తున్నారు. ఏ వర్గం వైపు వెళ్లలేక తెలుగు తమ్ముళ్లు అయోమయంలో పడ్డారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధినేత,


బహిరంగ సభకు హాజరైన భారీ జన సందోహం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళ్యాణదుర్గంలో చేపట్టిన భారీ బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో ప్రతిపక్ష నాయకుల్లో గుబులు రేకెత్తింది. బహిరంగ సభకు ఎవ్వరూ ఊహించనంతగా ప్రజలు హాజరుకావడంతో వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతుందోననే ఆలోచనలో పడ్డారు.

టీడీపీ పరువు తీసిన బస్సు యాత్ర

కళ్యాణదుర్గంలో ఉనికి కోసం పోటాపోటీగా కార్యక్రమాలు చేపట్టిన టీడీపీ నేతలకు పార్టీ చేపట్టిన భవిష్యత్తు భరోసా బస్సు యాత్రం ఉన్న పరువును కూడా తీసేసింది. ఇటీవల కుందుర్పి మండలం నుంచి ప్రారంభించిన బస్సు యాత్ర కళ్యాణదుర్గం వరకూ సాగింది. అయితే బస్సు యాత్రం ప్రారంభం నుండి ఉన్నం, ఉమా వర్గాలు బాహాబాహీలకు దిగడం, బస్సు యాత్రను అడ్డుకోవడం, ఒక వర్గంపై మరొక వర్గం రాళ్లు రువ్వుకోవడం, పోలీసు స్టేషన్ల వరకు వెళ్లి కేసులు పెట్టుకోవడం వంటి వాటితో కళ్యాణదుర్గంలో టీడీపీకి ఉన్న పరువు కూడా పోయింది. టీడీపీ కంచుకోటగా ఉన్న కళ్యాణదుర్గంలో 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించింది. కంచుకోటను బద్దలు కొడుతూ ప్రతిపక్షాల చర్యలను తిప్పికొడుతూ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పార్టీని బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్తోంది. ఈ తరుణంలో సీఎం బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్‌సీపీ జోష్ మరింత పెరిగింది.

అంచనాకు మించిన ప్రజాభిమానం

కళ్యాణదుర్గంలో వైఎస్సార్ జయంతి సందర్భంగా నిర్వహించిన రైతు దినోత్సవానికి అంచనాకు మించి ప్రజలు హాజరయ్యారు. నవరత్న పథకాల ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారన్న సందేశంతో ఒక్కసారిగా సభా ప్రాంగణానికి ప్రజా తాకిడి పెరిగింది. ఏర్పాటు చేసిన సభా ప్రాంగణం జనంతో నిండిపోయి మూడింతలుగా ప్రజలు బయట ఉన్నారంటే వైఎస్సార్‌సీపీపై ప్రజలు ఏపాటిగా మొగ్గు చూపుతున్నారో అర్థమైంది. ఈ సారి కూడా కళ్యాణదుర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురుతుందని, ఇందుకు సీఎం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందించడంతోనే ఇది సాధ్యమవుతుందని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా...ఎన్ని అమలు కానీ హామీలిచ్చినా ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ వైపే ప్రజలు ఉన్నారన్న సంకేతం బహిరంగ సభతో స్పష్టమైందన్నారు.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు కృషి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌ఐ శివ

బొమ్మనహాళ్: ప్రమాదాలను అరికట్టడానికి అందరూ కృషి చేయాలని ఎస్‌ఐ శివ సూచించారు. ఆదివారం మండలంలోని ఉంతకల్లు క్రాస్ వద్ద ఆయన వాహనాల తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. అనంతరం నిబంధనలు ఉల్లంఘించిన 52 మంది వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


మల్లికార్జున రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

కూడేరు: మండలంలోని ముద్దలాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లికార్జునరెడ్డి అనారోగ్యంతో బెంగళూరులో వైద్యం చేయించుకుని వచ్చాడు. ఆదివారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు.ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ నారాయణ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, బైరెడ్డి రామ చంద్రారెడ్డి, ఎర్రిస్వామి , నారాయణస్వామి, రామ్మోహన్ , మేఘనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఉపాధ్యాయుడు

కుందుర్పి: మండలంలోని ఎనుములదొడ్డి గ్రామంలో రెండేళ్ల కాలంగా బ్లాక్ ఫంగస్‌తో వ్యాధితో బాధపడుతున్న బోయ మహదేవ్‌కు ఉపాధ్యాయుడు బద్దేనాయక్ ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకొన్నారు. ఆదివారం ఎనుములదొడ్డికి వెళ్లిన ఆయన మహదేవ్‌తో మాట్లాడి రూ.9 వేల నగదు, రూ.11వేలు విలువ చేసే నిత్యావసర సరుకులను అందజేశారు. దాతను గ్రామస్తులు అభినందించారు.

ప్రవక్త అడుగుజాడలతోనే జీవితానికి సార్థకత


మౌలానా ప్రసంగాన్ని వింటున్న ముస్లిం సోదరులు

రాయదుర్గంటౌన్: అల్లా విధేయులుగా మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడిస్తేనే జీవితానికి సార్థకత చేకూరుతుందని మౌలానా సమీర్ సాబ్(బెంగళూరు), ముఫ్తీ ముజాహిద్ సాబ్, ముఫ్తి ముక్తియార్ సాబ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మక్కా మసీదు(చిన్న మసీదు)లో ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు జరిగే రాయదుర్గం డివిజన్ పరిధిలో మసీదుస్థాయి ఆధ్యాత్మిక సమ్మేళనం(జోడ్) కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఆదివారం అసర్ నమాజ్ నుంచి ప్రారంభమైన ఈ జోడ్‌కు రాయదుర్గంతో పాటు కళ్యాణదుర్గం, మొలకాల్మూరు, కణేకల్లు, వైఎస్‌హోసకోట నుంచి ముస్లింలు తరలిరానున్నారు. సోమవారం రాత్రి ఇషా నమాజ్ అనంతర సమ్మేళనం ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. సమ్మేళన కార్యక్రమానికి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసేందుకు బెంగళూరు నుంచి మౌలానా సమీర్ సాబ్, ముఫ్తి ముజాహిద్‌సాబ్, ముక్తియార్, రఫీక్‌సాబ్, అజ్మల్‌సాబ్ హాజరయ్యారు. హాజరయ్యేవారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా తబ్లిగ్ జమాత్ సభ్యులు,మసీదు కమిటీ, మక్కా మసీదు యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

దశభుజ గణపతికి పూజలు


అలంకరణలో దశభుజ గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

సేవలు విస్తృతం చేయడమే లక్ష్యం


మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ రామచంద్రమూర్తి

బెళుగుప్ప: శ్రీసత్యసాయి సేవా సమితులు మరింత విస్తృతంగా సేవలను అందించడమే లక్ష్యంగా కృషి చేయాలని శ్రీసత్యసాయి జిల్లా సేవా సమితుల కన్వీనర్ డాక్టర్ రామచంద్రమూర్తి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి సేవా మందిరంలో సేవల నిర్వహణ అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి సేవా సంస్థల మహిళా కోఆర్డినేటర్ శైలజ, బాల వికాస్ జిల్లా కోఆర్డినేటర్ గీతా తదితరులతో కలసి జిల్లా కన్వీనర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా తేలికభాషలో ఉంటుందన్నారు. అనంతరం శ్రీసత్యసాయి సేవా కేంద్రాల ద్వారా నారాయణసేవ, పేదలకు వస్త్రాలు అందంచడం, బాల వికాస్‌తో చిన్న పిల్లలకు భక్తి మార్గం నేర్పించుట, శాంతిమార్గంలో నడుచుట, సత్యసాయి జయంతి వేడుకలల్లో సేవలు అందిండంపై అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పిరిచువల్ కోఆర్డినేటర్ లింగమయ్య, ఐటీ కోఆర్డినేటర్ సాయి తేజ, మెడికల్ కోఆర్డినటర్ ధనుంజయ, మండల సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సీఎం భరోసా

బెళుగుప్ప: మండలంలోని నక్కలపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, సువర్ణమ్మ దంపతులు ట్రాక్టర్ ప్రమాదంలో వారం రోజుల క్రితం మృతి చెందడంతో.. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని శనివారం కళ్యాణదుర్గం పర్యటనలో జిల్లా అధికారులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. ఇటీవల జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన రైతు దంపతులకు కుమార్తె సుమనశ్రీ, కుమారుడు పునీత్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. రైతు కుమార్తె సుమనశ్రీని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వెంట తీసుకువెళ్లి శనివారం కళ్యాణదుర్గంలో హెలిప్యాడ్ వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రమాద సంఘటనను వివరించి ఆదుకోవాలని కోరారు. సమస్యపై అక్కడికక్కడే స్పందించిన సీఎం ఉదారంగా జిల్లా అధికార యంత్రాంగానికి అమ్మాయి సుమనశ్రీకి రూ.5 లక్షలు, అబ్బాయి పునీత్‌కు రూ.3 లక్షలు చొప్పున ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని సూచించారు. అలాగే పిల్లల చదువులకు సైతం ప్రభుత్వ తోడ్పాటు అందిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి రైతు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులు సుమనశ్రీ, పునీత్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

నేడు ఆలయ భూముల వేలం

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామంలో ఆంజినేయస్వామి, మూగబస్వస్వామి, పోతప్ప స్వామి ఆలయ భూముల సాగు వేలం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం ఉదయం 10 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు. గెనిగెర, మజరా గ్రామమైన అంబాపురం గ్రామస్తులు వేలంలో పాల్గొనాలని వారు కోరారు.

రేపు ఉంతకల్లులో 'జగనన్న సురక్ష'

బొమ్మనహాళ్: మండలంలోని ఉంతకల్లు గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం, తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. స్థానిక సచివాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు హాజరు కావాలన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

డి హిరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని మురడి హనుమాపురంలో ఆదివారం జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది. కర్నూలు లోని అమీలియా కంటి ఆస్పత్రి వైద్యులు హాజరై 145 మందికి చికిత్సలు నిర్వహించారు. 35 మందిని శస్త్ర చికిత్సకు రెఫర్ చేసినట్టు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కావలి ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల పరిరక్షణ సమితి అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేబుల్ చోరీ

బొమ్మనహాళ్: మండలంలోని కొలగానహళ్లిలో దాదాపు 30 మంది రైతుల పొలాల్లోని మోటార్ల కేబుల్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. బాధిత రైతుల వివరాల మేరకు.. శనివారం రాత్రి మోటార్లకు ఉన్న 300 మీటర్లకు పైగా కేబుల్‌ను దొంగిలించారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళుతున్నట్లు బాధిత రైతులు అనంతరాజు, పాటిల్ గిరిరాజు, ఉమాపతి, కావలి ఆంజినేయులు, సిద్దలింగ, బోయ తిప్పేస్వామి, సురేష్, ప్రభాకర్ తదితరులు తెలిపారు. ప్రస్తుతం పత్తి పంట సాగు చేశామని, అదే విధంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో వరి నారు పోసుకునేందుకు సిద్ధం చేసుకుంటున్న తరుణంలో మోటార్లకున్న కేబుల్‌ను దొంగలించారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

మధూ..నీ అవినీతిపై సీఐడీ విచారణకు సిద్ధమా?


మాట్లాడుతున్న బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులుగా ఉన్న తాను, వీరన్న భూకబ్జాలకు పాల్పడ్డామని తప్పుడు ఆరోపణలు చేస్తున్న వై.మధుసూదన్‌రెడ్డి అవినీతి, దౌర్జన్యకాండపై సీఐడీ విచారణకు సిద్ధమా అంటూ బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ కె.వీరమణ సవాల్ విసిరారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్‌ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, ఎంపీపీ చంద్రమ్మ, ఉప సర్పంచ్ వన్నప్ప, నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, మాజీ ఎంపీపీ, జడ్పీటీసీలు ఏసీఎర్రిస్వామి, సింగాడి తిప్పయ్యలతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు భూకబ్జాలకు పాల్పడ్డారంటూ ఇటీవల పార్టీ నుంచి సస్పెండ్ అయిన మధుసూదన్‌రెడ్డి పచ్చమీడియా వేదికగా పదే పదే చెబుతున్నారన్నారు. అనంతపురం రూరల్ పరిధిలోని 28 సర్వే నెంబర్‌లోని భూమి తమ పేరుతో 2008లోనే ప్రభుత్వం డి.పట్టా మంజూరు చేసిందన్నారు. ఈభూమిపై హక్కు, అనుభవం కల్గి ఉన్నామన్నారు. ఎన్ని ఆరోపణలు చేసినా మధు తండ్రి రాకెట్ల నారాయణరెడ్డి మీద ఉన్న గౌరవంతో ఊరుకున్నామన్నారు.

మధు అవినీతి చిట్టా ఇదిగో..

మధుసూదన్‌రెడ్డి అవినీతి, దౌర్జన్యకాండ పెద్ద ఎత్తున ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ వీడటానికి 2017లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, జేసీ దివాకర్ రెడ్డి సోదరుల సహకారంతో చంద్రబాబునాయుడును కలవడానికి ప్రయత్నించ లేదా అని వారు ప్రశ్నించారు. పార్టీ అధినాయకులను బ్లాక్‌మెయిల్ చేస్తూ తెలంగాణలో రూ.2 కోట్ల పనులు దక్కించుకున్నది నువ్వు కాదా అన్నారు. రాయదుర్గం ప్రాంతంలో ఇసుక వ్యాపారం చేసి భారీగా దోపిడీ చేశావు. ఉరవకొండలో 2015లో మద్యం షాపుల యజమానులను బెదిరించి రూ.15 లక్షలు దోపిడీ చేశావు. సాయినగర్‌లో ఎయిర్‌టెల్ టవర్ వద్ద స్థలం వ్యవహారంలో పంచాయితీ చేసి రూ.15 లక్షలు తీసుకోని, మరో రూ.10 లక్షలు డిమాండ్ చేస్తున్నది నువ్వు కాదా అన్నారు. అనంతపురంలోని శాంతి నగర్‌లో 30 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇవి మాత్రమే కాదని ఇంకా పెద్ద ఎత్తున మధు అవినీతి చిట్టా ఉందని తెలిపారు. దీనిపై దమ్ముంటే సీఐడీ విచారణకు సిద్ధం కావాలని ఆయన సవాల్ విసిరారు. హంద్రీనీవా కాలువ కాంట్రాక్టర్లను బెదిరించిన సమయంలో అప్పటి ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర నీకు కౌన్సెలింగ్ ఇచ్చింది మర్చిపోయావా అంటూ ధ్వజమెత్తారు. మీరు ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన భూకబ్జాల అంశం ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5లో వారం ముందుగానే ఎలా ప్రచురితమయ్యాయని, ఎల్లోమీడియా రాతలే మీ మాటలుగా గుర్తించాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. ఇప్పటికైనా నిరాధారమైన ఆరోపణలు చేయడం మానాలని హితువు పలికారు.

శరవేగంగా సబ్‌స్టేషన్ పనులు


75 వీరాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న సబ్‌స్టేషన్ పనులు

గుమ్మఘట్ట: మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపంలో 11 కేవీ సబ్‌స్టేషన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండి, వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. రూ.1.50కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 33-11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణపు పనులు క్షేత్రస్థాయిలో జోరందుకున్నాయి. మూడు ఫీడర్ల ద్వారా 10 గ్రామాల వ్యవసాయ రంగానికి , గృహ అవసరాల వినియోగదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లో ఓల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. 75 వీరాపురం, అడిగుప్ప, కలుగోడు, గౌనికుంట, పూలకుంట, జె.వెంకటంపల్లి, బీటీపీ లేఅవుట్‌లకు ఈ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరాఫరా కానుంది. పనులు ఊపందుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి,ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత క్లస్టర్ మంజూరుపై నేతన్నల హర్షం

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య కృషి ఫలితంగానే ఉరవకొండకు పెన్నోబులుశ్వర చేనేత క్లస్టర్ మంజురైందని ఎంపీపీ చందా చంద్రమ్మ, చేనేత విభాగం నేతలు ఎంసీ నాగభూషణం, కాసుల ఆంజినేయప్రసాద్, మిడతల చంద్రమౌళి తెలిపారు. ఆదివారం పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో లేర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేనేత విభాగం నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కేంద్ర జౌళిశాఖ వారు 8 చేనేత క్లస్టర్లు మంజురు చేయగా, ఇందులో ఉరవకొండకు ఒక చేనేత క్లస్టర్ మంజురైందన్నారు. కార్మిక కుటుంబాలను ఆదుకోవడానికి ఇచ్చిన మాటను నిలుపుకుంటూ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎంపీ రంగయ్య క్లస్టర్ మంజురు చేయించారన్నారు. 320 చేనేత కుటుంబాలు ప్రత్యక్షంగా క్లస్టర్ ద్వారా ఉపాధి పొందనున్నారని తెలిపారు. రూ.1.64 కోట్లతో మంజురైన క్లస్టర్‌కు మొదటి విడతగా రూ.60 లక్షలు మంజురయ్యాయన్నారు. క్లస్టర్ ఏర్పాటుకు సాయినగర్‌లో 20 సెంట్ల పంచాయతీ స్థలాన్ని కూడా కేటాయించారన్నారు. మాజీ ఎమ్మెల్యే, ఎంపీ కృషి పట్ల చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం నాయకులు కరూర్ వెంకటేష్, వెల్పల వాసు, బీరే శివ, అమర్నాథ్, రెడ్డి ఆంజినేయులు, లక్కా ఎర్రిస్వామి, సుదర్శన్, బ్రహ్మయ్య, పోసా రామాంజనేయులు, ఆర్‌సీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం నాయకులు

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

రాయదుర్గంటౌన్: బీటీపీ రోడ్డులో బ్రిడ్జి దాటిన తరువాత ప్రధాన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారుతున్నాయి. చేతికందేంత ఎత్తులోనే తీగలు వేలాడుతుండడంతో వాహనదారులు, స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. చాలా కాలంగా తీగల ఎత్తు పెంచకపోవడంతో ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది వాహనాల రాకపోకలు ఉండే ఈ మార్గంలో వేలాడుతున్న తీగలను సరి చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రమాదాలు జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించాలన్నారు.


బీటీపీ రోడ్డులో చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

సీఎం సభ సక్సెస్‌తో ప్రతిపక్షాలకు వణుకు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గంలో ఈ నెల 8న జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ విజయవంతం కావడంతో ప్రతిపక్షాలకు వణుకు పుట్టిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. సభ సక్సెస్‌పై ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్ సర్వోత్తమ, ఎంపీపీ మారుతమ్మ, సీనియర్ నాయకులు సుధీర్, సోమశేఖర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. సీఎం సభ సక్సెస్‌పై ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బీటీపీ పై ఊసెత్తని నాయకులు నేడు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌లను విమర్శించడం విడ్డూరమన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కళ్యాణదుర్గం అభివృద్ధికి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. బీటీపీ కాలువకు భూములు కోల్పోయిన రైతులకు టీడీపీ ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండానే కాలువ పనులు తవ్వి రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక భూములు కోల్పోయిన రైతులకు ఆదుకునేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లిందన్నారు. సీఎం సభలో ఏకంగా రూ.208 కోట్లు నిధులు భూములు కోల్పోయిన రైతులకు అందించడం జరుగుతుందని సీఎం ప్రకటించడంతో ప్రతిపక్షాలకు మింగుటపడటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో జేసీఎస్ పట్టణ కన్వీనర్లు అర్చన, ఆంజినేయులు, చాపిరి సర్పంచు హనుమంతు, ఉమేష్, కొండారెడ్డి, పోతేష్, సోమనాథ్ రెడ్డి, పరమేశ్వరప్ప, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు రూ.25కోట్ల మంజూరుపై హర్షం

కుందుర్పి: మండల కేంద్రంలో గురుకుల పాఠశాల నిర్మాణానికి రూ.25 కోట్ల మంజూరుకు సీఎం అంగీకరించడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఆదివారం కుందుర్పి సర్పంచ్ మారుతేశ్వరి స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. దశాబ్దాలుగా బీటీపీ కాలువల తవ్వకాలకు భూములిచ్చిన కుందుర్పి మండల రైతులకు మంత్రి ఉషాశ్రీచరణ్ చొరవతో ప్రభుత్వం నుండి పరిహారం అందనుందన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, జెడ్పీటీసీ రాధాస్వామి, ఎంపీపీ కమలమ్మ, మార్కెట్ యార్డు డైరెక్టర్ లింగప్ప, మాజీ సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, తిప్పేస్వామి, సర్పంచ్ అతావుల్లా, జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, నాయకులు పెద్దోబిశేసు, స్టుడియో కిష్ట, రామూర్తి, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం : మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చంద్రబాబు మోసం చేస్తే..జగనన్న న్యాయం చేశారు

కంబదూరు: కరువు రైతులకు కల్పతరువుగా భావించే బీటీపీ ప్రాజెక్ట్ విషయంలో గత టీడీపీ పాలనలో చంద్రబాబు మాయ మాటలతో రైతులను నట్టేట ముంచితే..ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీటీపీ భూ సేకరణకు అవసరమయ్యే రూ.208 కోట్లను మంజూరు చేసి రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారని రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు,బీసీ,రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, నీలి శంకరప్ప, సచివాలయ కన్వీనర్ సాకే గంగాధర్ అన్నారు. ఆదివారం వారు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త మల్లురి వెంకటేశులు, ఎంపీటీసీలు మల్లేష్, రమేష్, మైనార్టీ నాయకుడు ఆలీ, నాయకులు కొత్తమిద్దెల గోవిందప్ప, విల్సన్, రామస్వామి, రాజు, ఈడిగ హరీష్, రిజ్వన్, మల్లికార్జున, హనుమంతరాయుడు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవం సక్సస్ చేసినందుకు ధన్యవాదాలు

శెట్టూరు: కళ్యాణదుర్గంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన రైతు దినోత్సవం కార్యక్రమం జయప్రదం చేసినందుకు ప్రతి ఒక్కరికీ వైఎస్సార్‌సీపీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. మండలం నుంచి 110 బస్సుల్లో మహిళలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు ముఖ్యమంత్రి సభకు తరలిరావడం చూస్తే వైఎస్సార్‌సీపీకి ఉన్న బలం, ముఖ్యమంత్రి మీద ఉన్న నమ్మకం తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, ఎంపీపీ లక్ష్మీదేవి, సచివాలయాల కన్వీనర్ తిమ్మరాజు, పార్టీ మండల కన్వీనర్ శివన్న, మాజీ కన్వీనర్ సోమనాథ రెడ్డి, జెడ్పీటీసీ మంజునాథ, మాజీ ఎంపీపీ రామభీమప్ప, వైస్ చైర్మన్ చెవుల కిష్టప్ప, నాయకులు హరినాథ రెడ్డి, బొమ్మజ్జి రమేష్, ముత్యాలు, రామకృష్ణ, వీరభద్ర, శ్యామ్‌సుందర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనను జయప్రదం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు, రైతన్నలకు ధన్యవాదలు తెలియజేస్తున్నామని పార్టీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు గోపాలరెడ్డి, సర్పంచ్ గోవిందప్ప, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జిన్నామల్లి, హనుమంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రెడెప్ప పెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభిమాని బైకు స్టంట్లు

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం మాలేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ అభిమాని బోయ హనుమంతరాయుడు బైకు స్టంట్లు చేసి అందరి ఒళ్లు జలదరించేలా చేశాడు. కళ్యాణదుర్గంలో ఈనెల 8న జరిగిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభకు హాజరై తిరుగు ప్రయాణంలో హనుమంతరాయుడు తన బైకుకు వైఎస్సార్‌సీపీ జెండా కట్టిను ఆసరాగా చేసుకుని స్టంట్లు చేశాడు. రెండు చేతులు వదిలేసి బైకుపై నిలబడి ' జై జగన్...జై జై జగన్' అంటూ నినాదాలు చేస్తూ బైకు రైడింగ్ చేశాడు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.


బైకు స్టంట్లు చేస్తున్న బోయ హనుమంతరాయుడు